నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 11 జనవరి 2025 | SANGAREDDY

మీ బిడ్డ బాగా చదువుతున్నాడా..

- నేను రాసిన ఉత్తరం అందిందా
- అన్నింట్లో ఆదర్శంగా ఉన్న సిద్దిపేట.. 'పది' ఫలితాల్లోనూ ఫస్ట్ రావాలి
- ప్రత్యేక తరగతుల్లో సొంత ఖర్చులతో స్నాక్స్ ఏర్పాటు చేస్తా..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- పదోతరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో టెలీ కాన్ఫరెన్స్
- మంచి ఫలితాలు సాధించాలని పిలుపు

టెలికాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట అర్బన్, జనవరి 10 : అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిచిన సిద్దిపేట నియోజకవర్గం పదో తరగతి ఫలితాల్లోనూ ఆదర్శంగా నిలవాలన్నదే తన తాపత్రయమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. మార్చిలో జరిగే పదో తరగతి వార్షిక పరీక్షలకు పిల్లలను ప్రత్యేక శ్రద్ధ పెట్టి చదివించాలని మాజీ మంత్రి హరీశ్‌రావు శుక్రవారం సిద్దిపేట నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థుల తల్లిదండ్రులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మరికొద్ది రోజుల్లో మీ పిల్లలు పదో తరగతి పరీక్షలు రాయబోతున్నారని, వారికి ఇది అత్యంత కీలకమైన ఘట్టం అన్నారు. మంచి మార్కులతో గట్టెక్కితేనే ఉన్నత చదువుల దిశగా ముందడుగు వేసే అవకాశం ఉంటుందన్నారు. లేదంటే మీరు ఇన్నాళ్లు పడిన కష్టానికి, పిల్లల చదువుకు ఎలాంటి అర్థం ఉండదన్నారు. తల్లిదండ్రులుగా మీ పిల్లలు పరీక్షలు రాసే ముందు మీరు తీసుకునే ప్రత్యేక శ్రద్ధ ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. వార్షిక పరీక్షలు ముగిసేదాకా పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచడంతో పాటు విందులు, వినోదాలు, ఫంక్షన్లు, సినిమాలు, టీవీల జోలికి వెళ్లకుండా చూడాలన్నారు. మీ ఇంటికి సంబంధించిన పనులు, వ్యవసాయ పనులు వారికి చెప్పవద్దని హరీశ్‌రావు కోరారు.

పోటీ ప్రపంచంలో ప్రతిభ చాటితేనే అవకాశాలు..

ఈ పోటీ ప్రపంచంలో సాదాసీదాగా కాకుండా ప్రతిభను చాటితేనే మంచి అవకాశాలు వస్తాయని, మీ ఆశలకు, మీ పిల్లల ఆశయాలకు మధ్య వారధిగా తాను నిలబడడానికి కృషి చేస్తున్నట్లు హరీశ్‌రావు తెలిపారు. నాలుగేండ్లుగా సిద్దిపేట నియోజకవర్గంలో పదో తరగతి విద్యార్థులు అత్యధిక మార్కులు సాధిస్తున్నట్లు తెలిపారు. నూటికి నూరుశాతం పాసవుతూ..ప్రతిష్టాత్మకమైన బాసర ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థలోనూ 169 మంది నియోజకవర్గ విద్యార్థులు గతేడాది సీట్లు సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఉచిత ఇంజినీరింగ్ విద్యతోపాటు మంచి ఉద్యోగాలను దక్కించుకున్నట్లు గుర్తుచేశారు. మీ పిల్లలు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నదే తన ఆకాంక్ష, తపన అని, తన వంతుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులతో పాటు అల్పాహారం ఏర్పాటు చేస్తున్నానని, జిల్లా విద్యాధికారి నుంచి మీ పిల్లలకు చదువు చెప్పే హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమీక్షలు నిర్వహిస్తానని హరీశ్‌రావు చెప్పారు. వారి స్కూళ్లలో సౌకర్యాలు కల్పించామని, ఒక్క మార్కు తగ్గకుండా డిజిటల్ కంటెంట్ ద్వారా ప్రతి సబ్జెక్ట్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు హరీశ్ రావు తెలిపారు. ప్రజాప్రతినిధిగా, మీ కుటుంబంలో ఒకడిగా తనవంతు ప్రయత్నం తాను చేస్తున్నానని, మీరు కూడా మీ పిల్లలను బాగా చదివించాలన్నారు. చదువుతో పాటు చక్కని చేతిరాత ఉండేలా చూడాలన్నారు. ఇక మీ పిల్లల భవిష్యత్ మీ చేతుల్లోనే ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు.

విద్యాధికారులతో టెలీ కాన్ఫరెన్స్

సిద్దిపేట నియోజకవర్గ పదో తరగతి విద్యార్థుల ప్రిపరేషన్‌పై డీఈవో, ఎంఈవోలు, హెచ్‌ఎంలతో మాజీ మంత్రి హరీశ్‌రావు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. మార్చిలో పదో తరగతి పరీక్షలు జరుగుతాయని, ఐదేండ్ల నుంచి జిల్లాలో అగ్రస్థానంలో నిలిచిందని, గతేడాది సిద్దిపేట నియోజకవర్గం 99శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇది మీ కృషి ఫలితమని, మీ సమిష్టి కృషికి, సమన్వయ చొరవకు అభినందనలు తెలిపారు. ఇదే స్ఫూర్తి, అదే పంథాతో ముందుకు వెళ్దామన్నారు. ఇప్పటికే విద్యార్థుల తల్లిదండ్రులకు మీ ద్వారా ఉత్తరాలు పంపామని, చేరినాయని కూడా తెల్సిందన్నారు. త్వరలోనే పాఠశాలల వారీగా సమీక్ష నిర్వహిస్తానని, డల్‌గా ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ, దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులకు త్వరలోనే స్నాక్స్ ఏర్పాటు చేస్తానని, ప్రతి పదిమంది విద్యార్థికి ఒక టీచర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. టీచర్లు విద్యార్థులను దత్తత తీసుకోవాలని, వారిని ఇంటికి వెళ్లి చదివిపించడం, వారి తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడి ఉదయం లేపడం, టీవీలు, ఫోన్లకు దూరంగా ఉంచడం ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. ఏ సబ్జెక్ట్‌లో విద్యార్థి వీక్‌గా ఉన్నాడో గుర్తించి వారికి ప్రత్యేక కౌన్సెలింగ్ ఇవ్వాలన్నారు. వచ్చే రెండు నెలలపాటు విద్యార్థులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, సిద్దిపేట నియోజకవర్గం మంచి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని హరీశ్ రావు సూచించారు.

మంజీరా నదిలో మొసళ్ల కలకలం

మెదక్ జిల్లా చిలిపిచెడ్ గ్రామ శివారులో మంజీరా నది ఒడ్డున ఉన్న మొసలి

చిలిపిచెడ్, జనవరి 10: మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలంలో ప్రవహిస్తున్న మంజీరా నదిలో మొసళ్లు సంచరిస్తుండడంతో నదిలో చేపలు పట్టేవారు, గొర్రెలు, మేకలకాపరులు, రైతులు భయాందోళనకు గురవుతున్నారు. శుక్రవారం చిలిపిచెడ్ శివారు మంజీరా నదిలో బర్రెలు, గొర్రెలకాపరులకు మొసళ్లు కనిపించడంతో ఒడ్డుకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న రైతులు, మత్స్యకారులు అక్కడికి చేరుకున్నారు. మొసలి కొద్దిసేపటికి నీటిలోనికి చేరడంతో అక్కడి నుంచి వారు ఇంటికి ప్రయాణమయ్యారు. కొత్తమంది సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసి సోషల్ మీడియాలో వైరల్ చేశారు. మొసళ్ల సంచారంతో నదీతీర ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

అందని ద్రాక్షలా రేషన్‌కార్డులు

- కొత్త రేషన్ కార్డులకు ఎదురుచూపులు
- కాంగ్రెస్ ప్రభుత్వ ప్రకటనలతో అయోమయంలో లబ్ధిదారులు
- జనవరి 26నుంచి కొత్త రేషన్ కార్డుల పంపిణీ లేనట్లేనా...?

హుస్నాబాద్, జనవరి 10: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కొత్త రేషన్‌కార్డుల జారీ విషయంలో ఇదుగో వచ్చే...అదిగో వచ్చే అంటూ మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రకటనలు చేయడంతో లబ్ధిదారులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ఏడాదిగా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న రేషన్‌కార్డులు లబ్ధిదారులకు అందని ద్రాక్షలా మారాయని చెప్పవచ్చు. ప్రజా పాలన దరఖాస్తులు తీసుకొని ఏడాది గడిచింది. అయినా కొత్త రేషన్‌కార్డుల జారీ గురించి పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న లబ్ధిదారులకు నిరాశే మిగులుతోంది. ప్రజాపాలన దరఖాస్తులకు ముందు రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నవారు చాలామంది ఉన్నారు. చాలా ఏండ్లుగా కొత్త రేషన్‌కార్డులు రాకపోవడంతో దరఖాస్తు దారుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. జనవరి 26 నుంచి కొత్త రేషన్‌కార్డులు పంపిణీ చేస్తామని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ ఇటీవల హుస్నాబాద్‌లో ప్రకటించారు.సమయం సమీపిస్తున్నా ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలు, సర్వేలు కానీ ఇప్పటి వరకు మొదలు కాకపోవడంతో రేషన్‌కార్డుల పంపిణీపై నీలినీడలు అలుముకుంటున్నాయి. కేవలం ప్రకటనలతో మభ్యపెడుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. హుస్నాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని గ్రామాల్లో ప్రస్తుతం 13,205 మంది రేషన్‌కార్డు లబ్ధిదారులు ఉన్నారు. ఇందులో 747 అంత్యోదయ కార్డులు ఉండగా, 12,458 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఉన్నాయి. హుస్నాబాద్ మున్సిపాలిటీ పరిధిలో 405 అంత్యోదయ కార్డులు, 5,336 ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఉన్నాయి. మండలంలోని గ్రామాల్లో 342అంత్యోదయ కార్డులు, 6,375ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఉన్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఫుడ్ సెక్యూరిటీ కార్డులు ఇంకా కొనసాగుతున్నాయి.

వేలసంఖ్యలో దరఖాస్తుదారులు...

హుస్నాబాద్ మున్సిపాలిటీ, మండలంలో కొత్తగా రేషన్‌కార్డుల కోసం సుమారు 3నుంచి 4వేల మంది దరఖాస్తు చేసుకుని ఎదురుచూస్తున్నారు. కొన్నేండ్ల వివాహమైన వారు, కుటుంబం నుంచి వేరుపడిన వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నది. హుస్నాబాద్ పట్టణంలోనే సుమారు 2 వేల మంది రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారు. కానీ, సర్కారు విధివిధానాలు, కొత్త రేషన్‌కార్డుల జారీపై స్పష్టమైన ప్రకటన జారీ చేయక పోవడంతో వీరంతా అయోమయానికి గురవుతున్నారు. జనవరి 26నుంచి ఇస్తారని కొందరు, మార్చి తరువాతనే ఇస్తారని మరి కొందరు మంత్రులు ప్రకటనలు ఇస్తుండడం, రేషన్‌కార్డుల జారీ ప్రక్రియకు కనీసం అంకురార్పణ చేయకపోవడంతో చాలామంది నిరాశకు గురవుతున్నారు.

పెరగని రేషన్ దుకాణాల సంఖ్య..

ప్రస్తుతం ఉన్న రేషన్ లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా రేషన్ దుకాణాల సంఖ్య పెరగలేదు. దీంతో ఒకే దుకాణంలో వందల సంఖ్యలో లబ్ధిదారులు ఉండడంతో రేషన్ పంపిణీ ప్రహసనంగా మారింది. హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో అంత్యోదయ, రేషన్‌కార్డులు కలిపి మొత్తం 5,741మంది లబ్ధిదారులు ఉంటే, కేవలం 8 రేషన్ దుకాణాలు మాత్రమే ఉన్నాయి. పట్టణంలోని 3811004 నంబర్ రేషన్ దుకాణంలో ఏకంగా 1,290 మంది లబ్ధిదారులు ఉన్నారు. ప్రతి దుకాణంలో 500ల నుంచి 900ల మంది లబ్ధిదారులు ఉండడంతో గంటల తరబడి రేషన్ కోసం వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడ ఉన్న 20వార్డుల్లో వార్డుకో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మండలంలోని 17గ్రామ పంచాయతీల్లో 16దుకాణాలు ఉన్నాయి. పొట్లపల్లి, పందిల్ల, మీర్జాపూర్ గ్రామాల్లో రెండు చొప్పున ఉండగా, మిగతా గ్రామాల్లో ఒక్కోటి మాత్రమే ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న రేషన్ దుకాణాను రెట్టింపు చేస్తేనే లబ్ధిదారులకు సౌకర్యంగా ఉంటుంది.

ప్రభుత్వ ఆదేశాలు రాగానే జారీ..

కొత్త రేషన్‌కార్డుల పంపిణీ కోసం ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే హుస్నాబాద్ మున్సిపాలిటీతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో దరఖాస్తులు స్వీకరిస్తాం. ఆ తర్వాత అర్హులను ఎంపిక చేసే ప్రక్రియ మొదలవుతుంది. రేషన్‌కార్డు కోసం గతంలో 250 దరఖాస్తులు వచ్చాయి. కొత్త రేషన్‌కార్డుల పంపిణీ లేనందున ఇవి పెండింగ్‌లో ఉన్నాయి. ఎప్పటి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తారు, ఎప్పటి నుంచి రేషన్‌కార్డులు ఇస్తారనే విషయంపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి ఆదేశాలు లేవు. రేషన్‌కార్డుల కోసం చాలా మంది వేచిచూస్తున్న మాట వాస్తవం. రేషన్ దుకాణాల సంఖ్య పెంపుపై ప్రభుత్వానికి నివేదిస్తాం.

–రవీందర్‌రెడ్డి, హుస్నాబాద్ తహసీల్దార్

చెక్‌డ్యామ్‌ల పనులు ప్రారంభించండి

అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 10: సిద్దిపేట జిల్లా నారాయణరావుపేట మండలం గోపులాపూర్‌లో రూ. 1.34 కోట్లతో, చిన్నకోడూర్ మండలం కస్తూరిపల్లిలో రూ. 3.28 కోట్లతో చెక్‌డ్యామ్‌ల నిర్మాణ పనులు ఎమ్మెల్యే హరీశ్‌రావు చొరవతో ప్రారంభం కానున్నాయి. బీఆర్‌ఎస్ ఈ చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిధులు కేటాయించామని, టెం డర్లు పూర్తయినా పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదని, ఇటీవల హరీశ్‌రావు రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి లేఖ రాశారు. పనులు ప్రారంభించాలని అనుమతులు వచ్చాయని, చెక్‌డ్యామ్‌లు పూర్తయితే కస్తూరిపల్లిలో 200 ఎకరాలు, గోపులాపూర్, మాటిండ్ల శేఖర్‌రావుపేట గ్రామాల్లో 100 ఎకరాలకు భూగర్భ జలాలు పెరుగుతాయని హరీశ్‌రావు తెలిపారు. వెంటనే పనులు ప్రారంభించాలని ఇరిగేషన్ అధికారులను మాజీమంత్రి హరీశ్‌రావు ఆదేశించారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మద్దూరు గ్రామస్తులు

ఇండ్లు మంజూరు చేస్తే ప్లాట్లలో కట్టుకుంటాం..

తహసీల్దార్‌కు మద్దూరు గ్రామస్తుల వినతి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 10: ప్రభుత్వం గతంలో బీపీఎల్ కింద నిరుపేదలకు కేటాయించిన ప్లాట్లను ఇతర పథకాల కోసం వినియోగించకూడదని తహసీల్దార్ ఏజే రహీంకు మద్దూరు గ్రామస్తులు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ..1998లో 175, 152 సర్వేనెంబర్లలో బీపీఎల్ కుటుంబాల కోసం అప్పటి మాజీమంత్రి నిమ్మ రాజిరెడ్డి 125 కుటుంబాలకు ప్లాట్లు అందించి, పట్టాలు ఇచ్చారని గుర్తుచేశారు. అప్పట్లో కరెంట్, నీటి సౌకర్యం లేకపోవడంతో ఇండ్లు కట్టుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయిస్తే ఇండ్లు నిర్మించుకుంటామని తెలిపారు. ఈ ప్లాట్లను ఇతర పథకాల కోసం కేటాయించకూడదని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భూర్గు నర్సింహులు, బొప్పె కనకమ్మనాగయ్య, బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు దామెర మల్లేశం, మైనార్టీ నేతలు షకీల్‌అహ్మద్, ఫయాజ్, ముఖసీర్, జమీల్, సలీం, అబ్దుల్ ఖాదర్, గాజుల నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ వెంచర్ పనులను అడ్డుకున్న అధికారులు

కంది మండలం చిద్రుప్ప శివారులో అక్రమ వెంచర్ పనులను అడ్డుకొని, ప్రకటన బోర్డులను తొలిగిస్తున్న ఎంపీవో మహేందర్‌రెడ్డి

కంది, జనవరి 10: సంగారెడ్డి జిల్లా కంది మం డలం చిద్రుప్ప గ్రామ శివారులో కొనసాగుతున్న అక్రమ వెంచర్ పనులను శుక్రవారం అధికారులు అడ్డుకున్నారు. హెచ్ ఎండీఏ పరిధిలో ఉన్న కంది మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్లుగా మార్చి విక్రయించేందుకు సిద్ధం చేస్తున్నారు. వ్యాపారులు సాగు భూములను గుంటల చొప్పున కొనుగోలు చేసి ప్లాట్లుగా మార్చి ఫాం ల్యాండ్ పేరిట విక్రయిస్తున్నారు. నాలా పన్ను చెల్లించి, హెచ్‌ఎండీఏ నుంచి లేఅవుట్ అనుమతులు పొందిన తర్వాతే విక్రయాలు జరపాలి. కానీ, అలా కాకుండానే వ్యాపారులు ఆకర్షణీయ ప్రకటనలతో కొనుగోలుదారులను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కంది ఎంపీవో మహేందర్‌రెడ్డి వెంచర్‌ను పరిశీలించి పనులను అడ్డుకోవడంతోపాటు ప్రకటనల బోర్డులను తొలిగించారు. అన్ని అనుమతులు పొందిన తర్వాతే పనులు ప్రారంభించాలని, లేనిపక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పూర్తిగా తెలుసుకున్న తర్వాతే కొనుగోలుదారులు ముందుకు రావాలని, ఇందులో ఏమైనా నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామన్నారు.

సిద్దిపేట జిల్లా చేర్యాలలో విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

మంచి చేసిన కేసీఆర్..ముంచిన కాంగ్రెస్

- కాంగ్రెస్ వైఫల్యాలను ప్రచారం చేయండి
- స్థానిక ఎన్నికల్లో సత్తాచాటాలి
- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పిలుపు
- చేర్యాల, కొమురవెల్లి మండలాల కార్యకర్తలతో విస్తృతస్థాయి సమావేశం

చేర్యాల, జనవరి 10: తెలంగాణ ప్రజలకు అన్ని విధాలుగా మంచి చేసింది తొలి ముఖ్యమంత్రి కేసీఆరేనని, అసత్య ప్రచారంతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజలను నిండా ముంచిందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాలలోని రేణుక గార్డెన్స్‌లో శుక్రవారం చేర్యాల, కొమురవెల్లి మండలాల బీఆర్‌ఎస్ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గులాబీజెండా రెపరెపరాడాలని పిలుపునిచ్చారు. 13 నెలల కాలంలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజలకు వివరిస్తే సరిపోతుందని, ఇదే సమయంలో తెలంగాణ ప్రజలకు కేసీఆర్ చేసిన మంచి పనులతో పాటు ఆయన అమలు చేసిన పథకాలను వివరించాలన్నారు. కాంగ్రెస్ సర్కారు అనుసరిస్తున్న వైఖరిని ఇంటింటా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రైతుబంధు, ధరణితో రైతులకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు తెస్తున్న 'భూమాత'తో రైతులకు కష్టాలు తెచ్చిపెట్టనుందని, దీనిపై ప్రజలకు అర్థమయ్యేలా పార్టీ నాయకులు ప్రచారం చేయాలన్నారు. 24గంటల ఉచిత కరెంటుతో వ్యవసాయం పండగలా మారిందని, భూములకు ఎంతో విలువ పెరిగిందన్నారు. కాంగ్రెస్ పాలనలో భూముల ధరలు ఢమాల్ అన్నట్లు ఎమ్మెల్యే పల్లా తెలిపారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు, హామీలపై క్యాడర్ ఎక్కడికక్కడ ప్రభుత్వాన్ని ప్రశ్నించాలన్నారు. తన దవాఖానలో ప్రజలకు ఉచిత వైద్యం, పరీక్షలు, మందులిచ్చే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. తాను నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని కొందరు అసత్య ప్రచారం చేస్తున్నారని, మీరే వారికి సమాధానం చెప్పాలని పల్లా రాజేశ్వర్‌రెడ్డి కోరారు. సమావేశాల్లో బీఆర్‌ఎస్ అధ్యక్షుడు, మాజీ ప్రజాప్రతినిధులు ముస్త్యాల నాగేశ్వర్‌రావు, అనంతుల మల్లేశం, గీస భిక్షపతి, కౌన్సిలర్ మంగోలు చంటి, వుల్లంపల్లి కరుణాకర్, సిలువేరు సిద్దప్ప, తలారీ కీర్తనాకిషన్, అంకుగారి శ్రీధర్‌రెడ్డి, సుంకరి మల్లేశం గౌడ్, పుర్మ వెంకట్‌రెడ్డి, వకులాభరణం నర్సయ్యపంతులు, ముస్త్యాల బాల్‌నర్సయ్య, ఏకానందం, కొండయ్య, యాదగిరి, గదరాజు చందు, బూరగోని తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న గంగాపూర్ విఠలాపూర్ రైతులు

కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

కృతజ్ఞతలు తెలిపిన విఠలాపూర్, గంగాపూర్ రైతులు

చిన్నకోడూర్, జనవరి 10: సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కృషితో 2600 ఎకరాలకు సాగునీరు అందేందుకు మార్గం సుగమం కావడంతో రైతులు కృతజ్ఞతగా కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం విఠలాపూర్, గంగాపూర్ గ్రామాలకు సాగునీరు అందడం లేదని ఇటీవల హరీశ్‌రావుకు ఇరు గ్రామాల రైతులు విన్నవించగా, వెంటనే ఆయన స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. కాల్వ కోసం భూములు కోల్పోయే రైతులతో మాట్లాడి ఒప్పించి కాల్వ పనులను ప్రారంభించిడానికి కృషిచేశారు. దీంతో రైతులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ శుక్రవారం కేసీఆర్, హరీశ్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ పాపయ్య మాట్లాడుతూ.. గతంలో కాల్వ నిర్మాణానికి అడ్డంకులు ఎదురయ్యాయని, అడ్డంకులు తొలిగించడానికి హరీశ్ రావు ఎంతగానో కృషిచేశారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రయోజనాన్ని గాలికి వదిలేసిందని, రైతులపై ప్రేమ ఉంటే రంగనాయక సాగర్ నుంచి కాలువలకు నీళ్లు వదిలిపెట్టి చెరువులు నింపి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ వ్యవసాయాన్ని పండుగలా చేస్తే కాంగ్రెస్ దండుగ చేసేలా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రైతుబంధు ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ మద్దికుంట నవీన్, బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు గుండెల్లి వేణు, రైతులు కుంటయ్య, రాములు, ఎల్లయ్య, ఆకునూరి శంకర్, పిడిశెట్టి నర్సయ్య, శంకర్ రెడ్డి, శ్రీనివాస్, దేవయ్య, ఎల్లయ్య, భూపతి, తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

ముక్కోటి వైభవం..

ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాలో వైష్ణవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల నిర్వాహకులు భక్తులకు ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు. అర్చకులు, భక్తులు విశేష పూజలు చేశారు. పలుచోట్ల అన్నదానాలు, ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు భక్తులు ఉపవాసాలు పాటించారు. గోవింద నామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. పలు ఆలయాల్లో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రత్యేక పూజలు చేశారు.

– నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, జనవరి 10

దుబ్బాక: బాలాజీ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, మాధవానంద స్వామీజీ

పెండ్లి చేసుకున్న గంటల్లోనే ఆత్మహత్య

- ప్రేమ పెండ్లికి కుటుంబసభ్యులు ఒప్పుకోలేరని ఆత్మహత్య
- సంగారెడ్డి జిల్లా బుసారెడ్డిపల్లి గ్రామశివారులో హరిత రెస్టారెంట్‌లో ప్రేమికుల మృతి
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఉదయ్, రోహిత(ఫైల్)

మునిపల్లి, డిసెంబర్ 10: ఒకరినొకరు ప్రేమించుకున్నారు. వారి ప్రేమను ఇరు కుటుంబాలు ఒప్పుకోలేదు. ఎలాగైనా పెండ్లి చేసుకోవాలని ఆ ప్రేమజంట గట్టిగా నిర్ణయించుకుంది. అందులోభాగంగానే సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలంలోని బుసారెడ్డిపల్లి శివారులోని తెలంగాణ హరిత రెస్టారెంట్‌లో ఇద్దరు కలిసి గురువారం ఉదయం 11గంటలకు రూమ్ బుక్ చేసుకొని పసుపుతాడుతో పెండ్లి చేసుకున్నారు. అనంతరం ఆత్మహత్య చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా మునిపల్లి ఎస్సై రాజేశ్‌నాయక్ వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ ప్రాంతంలోని నిజాంపేటకు చెందిన కర్నే ఉదయ్(21), మంగళి రోహిత(20) ఒకరినొకరు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. పెద్దల సమక్షంలో పెండ్లి చేసుకుందామని, ఇరు కుటుంబాలకు చెప్పడంతో పెద్దలు ఒప్పుకోలేదు. దీంతో ఇద్దరు కలిసి పెండ్లి చేసుకొని ఆత్మహత్య చేసుకోవడం ఇరు కుటుంబాల్లో తీరని విషాదాన్ని మిగిల్చింది.

పెండ్లి చేసుకున్న గంటల్లోనే అనంతలోకాలకు...

కలిసి బతకలేం...విడిచి ఉండలేం...మనకల పెండ్లి చేసుకోవడం అనుకున్నారు ఇద్దరు ప్రేమికులు. అద్దెకు తీసుకున్న గదిలోనే పెండ్లి చేసుకున్న తర్వాత కొన్ని గంటల్లోనే ఆత్మహత్య చేసుకున్న ఘటన సంగారెడ్డి జిల్లా మునిపల్లి మండలం బుసారెడ్డిపల్లిలో శుక్రవారం కలకలం రేపింది. ప్రేమ పెండ్లికి ఇరు కుటుంబాలు ఒప్పుకోకపోవడం ఈ ఆత్మహత్యకు దారితీసిందని సమాచారం. మృతురాలు రోహిత నారాయణఖేడ్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదువుతున్నది. ఉదయ్ మిరపకాయల వ్యాపారం చేసేవాడు. రెస్టారెంట్ మేనేజర్ సాంబశివరావు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమావేశం

కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలి
- గ్రామాల్లో గ్రామ సభలు, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలి
- కలెక్టర్లకు సీఎం ఆదేశం

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 10: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీదర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క సురేఖ, జూపల్లి కృష్ణారావులతో కలిసి జిల్లా కలెక్టర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఎం రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలు.. అర్హుల జాబితా తయారీపై చర్చించారు. 26న రిపబ్లిక్ డేను పురస్కరించుకొని రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని నిర్ణయించారు. ఈ పథకాల అమలుపై రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో గ్రామ సభల నిర్వహణ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించేందుకు సన్నాహాలు చేసుకోవాలని ఆదేశించారు.

హాజరైన సంగారెడ్డి కలెక్టర్ క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, జనవరి 10: సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సమావేశానికి సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరయ్యారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, కొండా సురేఖ, జూపల్లి కృష్ణారావుతో కలిసి సీఎం కలెక్టర్లతో సమావేశమయ్యారు. రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు, లబ్ధిదారుల జాబితా తయారీ తదితర అంశాలపై చర్చించారు. ఈనెల 26న రిపబ్లిక్ డే నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేయాలని సమావేశంలో నిర్ణయించారు. పథకాల అమలుపై గ్రామాల్లో గ్రామసభ, మున్సిపాలిటీల్లో వార్డు సభలు నిర్వహించాలన్నారు.